

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

సిర్పూర్(టి), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండో విడతలో డిసెంబరు 14న కొనసాగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. మండల కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని గురువారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే నామినేషన్లను స్వీకరించాలన్నారు. డిసెంబరు 13న డీపీఈపీ పాఠశాలలో జవహర్ నవోదయ పరీక్ష నిర్వహించనున్నందున డిస్ట్రిబ్యూషన్‌ను మండల కేంద్రంలోని ఇడెన్ గార్డెన్ ప్రైవేటు పాఠశాలకు మార్చామని అన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

దహెగాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్స్పైర్ మనాక్, బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చాటిన ఐదుగురు విద్యార్థులను గురువారం పలువురు అభినందించారు. మండలంలోని చిన్నరాస్పెల్లి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పాలె వాహిని రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. కార్యక్రమంలో కిరణ్, మహేష్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి బాలల విజ్ఞాన మేళాలో మండలంలోని సోమిని పాఠశాల విద్యార్థులు కార్తీక్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లాలో 32 షాపులు

జిల్లాలో 32 మద్యం షాపులు ఉన్నాయి. రెండేళ్ల పాటు ప్రభుత్వం మద్యం అమ్ముకోవడానికి లైసెన్సులు జారీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, ఇన్ స్టాల్‌మెంట్ పేమెంట్లు షాపు ఓనర్లు పూర్తి చేసుకున్నారు. బ్యాంకు గ్యారంటీలతో పాటు షాపు నిర్వహణకు అనువైన ప్రాంతంలో గదులను వెతికే పనిలో పడిపోయారు. కాగా కొత్తగా మద్యం లైసెన్సులు పొందిన వారికి పంచాయతీ ఎన్ని కల రూరంలో లక్ కలిసి రానుంది. కొత్త మద్యం షాపు యజమానులకు స్థానిక సంస్థల ఎన్నికలు, పరిషత్, మున్సిపాలిటీ ఎన్నికలు రానుండం మద్యం షాపు యజమానుల పంట పండినట్లేనని చర్చ జరుగుతోంది. ఈ ఏడాదంతా ఏదో రకంగా మద్యానికి గిరాకీ ఉండనుందని చెబుతున్నారు. మద్యం షాపులు దక్కని వ్యాపారులు భారీగా గుడ్‌విల్ ఆఫర్ చేసి చాలా చోట్ల షాపులను కొనుగోలు చేశారని తెలిసింది. ఆయా ఏరియాలను బట్టి మద్యం షాపులకు రూ. 60లక్షల నుంచి కోటిపై వరకు గుడ్‌విల్ ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు.

మద్యం వ్యాపారులకు ఎన్నికల కిక్కు

- 1 నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం
- పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌తో పెరుగనున్న అమ్మకాలు
- ఓట్ల వేటలో మద్యం పంపిణీ షరామామూలే
- నేటి నుంచి కొత్త లైసెన్సుదారులకు లిక్కర్ కేటాయింపు

చింతలమానేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం షాపులకు పంచాయతీ ఎన్నికలు కిక్కు ఇవ్వనున్నాయి. 2025-27 సంవత్సరానికి ఇటీవలే మద్యం షాపులకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. గత అక్టోబరు 27న జిల్లాలోని 32 లిక్కర్ షాపులకు లక్కీ డ్రా నిర్వహించారు. షాపులకు లక్కీ డ్రా ద్వారా లిక్కర్ వ్యాపారులను ఎంపిక చేశారు. డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త షాపులను ప్రారంభించేందుకు మద్యం షాపుల యజమానులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఈ క్రమంలోనే ప్రభుత్వం పంచా యతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. దీంతో లిక్కర్ షాపుల యజమానులకు షాపుల ప్రారంభం లోనే లాభాల కిక్కు తగలనుందని చెబుతున్నారు. ఏడాది కాలం లోనే పరిషత్, మున్సిపాలిటీ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశం ఉండడంతో ఈ సారి మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి అమ్మకాలు జోరుగా ఉండనున్నాయని చెబుతున్నారు.

ప్రారంభంలోనే..

కొత్త మద్యం షాపులకు ప్రారంభంలోనే పంచాయతీ ఎన్నికల రూపంలో కలిసి వస్తుంది. పాత షాపులకు నవంబరు 30వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ, కొత్త షాపులకు ఈ నెల 28వ తేదీ నుంచే మద్యం కేటాయించనున్నారు. డిసెంబరు 1 నుంచి అమ్ముకునేందుకు ఎక్సైజ్‌శాఖ అనుమతులు ఇవ్వనుంది. కాగా ఇప్పటికే ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించింది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల ఘట్టం 29వ తేదీతో ముగియనుంది. డిసెంబరు 1 నుంచే అసలైన ఎన్నికల సంగ్రామం మొదలు కానుంది. ఇదే తేదీ నుంచి కొత్త మద్యం షాపులు ప్రారం భం కానున్నాయి. ఒక్కొక్క గ్రామంలో 15 రోజుల వరకు ఎన్నికల తంతు జరుగుతుంది. అన్ని ప్రధాన పార్టీలు గత మద్దతుదారులను బరిలో దించేందుకు సిద్ధమవుతున్నారు. లోకల్‌బాడీ ఎన్నికల్లో మద్యం కీలకమే బహిరంగ రహస్యమే. పోటీదారులు భారీ ఎత్తున మద్యాన్ని కొనుగోలు చేసి డంప్ చేయడం, ఈ తర్వాత పోలింగ్ ముందు పంపిణీ చేయడం జరిగే తంతే. అన్ని ప్రధాన పార్టీలు కూడా ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ తీవ్రంగా ఉండడంతో పాటు లిక్కర్‌కు కూడా భారీగా డిమాండ్ పెరుగనుంది. దీంతో కొత్తగా మద్యం షాపులను దక్కించుకున్న వారికి పంచాయతీ ఎన్నికలతో భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

పరిశీలించి.. సూచనలు చేసి..



వాంకిడిలో నామినేషన్ కేంద్రం సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాంకిడి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే గురువారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఇబ్బంది కలుగ కుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ దరఖాస్తులు, ఓటరు జాబితా లను అందుబాటులో ఉంచుకోవాలని రిటర్నిగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సూచించారు. నామినేషన్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు స్వీకరిచాలని చెప్పారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో జోత్స్న, ఇన్‌చార్జి తహసీల్దార్ రిజాయ్‌అలీ తదితరులు ఉన్నారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

దహెగాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తహసీల్దార్ మునావర్ షరీఫ్, డీఎస్పీ వహిదుద్దీన్ గురువారం పరిశీలించారు. మండలంలోని కోత్మీర్, దహెగాం, కుంచవెల్లి, గిరివెల్లి రైతు వేదికలు, దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఒడ్డుగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల నామినేష్ పత్రాల స్వీకరిం చేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని అధికారులు సూచించారు. వారి వెంట సీఐ కుమారస్వామి, ఎస్సై విక్రం తదితరులు ఉన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను గురువారం ఎస్సై ఇస్లావత్ నరేష్ పరిశీలించారు. మండలంలో రెండో విడతలో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఈ నెల 30 నుంచి నామినేషన్ దరఖాస్తులను స్వీకరించున్నారు.. అందరు ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని సూచనలు చేశారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను గురువారం తహసీల్దార్ తిరుపతి, ఎంపీడీవో ఆల్బర్ట్, ఎస్సై అనిల్‌కుమార్‌లు పరిశీలించారు. మండలంలో రెండో విడతలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఈ నెల 30 నుంచి నామినేషన్ దరఖాస్తులను స్వీకరించనున్నామని తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు నామినేషన్లు

మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 15, వార్డులకు నాలుగు దాఖలు

ఆసిఫాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొదటి విడతలో నిర్వహించే పంచాయతీ ఎన్నికల గురువారం పలువురు నామినేషన్లు వేశారు. మొదటి రోజు జిల్లాలో తొలి రోజు సర్పంచ్ స్థానాలకు 15 నామినేషన్లు, వార్డు స్థానాలకు నాలుగు నామినేషన్‌లు దాఖలు అయ్యాయి.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం క్లస్టర్‌లోని సావర్‌ఖేడ సర్పంచ్ స్థానానికి ఒక నామినేషన్ దాఖలు అయింది. ఎన్నికల నామినేషన్ ప్రక్రియను జడ్పీ సీఈవో లక్ష్మినారాయణ, డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్, ఎంపీడీవో సురేష్‌కుమార్, ఎంపీవో సాయిరాంగౌడ్, ఎస్సై మధుకర్ తదితరులు పరిశీలించారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో మొదటి రోజు మొత్తం ఐదు నామినేషన్‌లు వచ్చినట్లు ఎంపీడీవో జోత్స్న తెలిపారు. ఇందులో వాంకిడి గ్రామ పంచాయతీలో సర్పంచు స్థానానికి 2, ఖమన గ్రామ పంచాయతీలో సర్పంచు స్థానానికి 2, వార్డు సభ్యుల స్థానానికి ఒక నామినేషన్ వచ్చిందని తెలిపారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలో 14 సర్పంచ్ స్థానాలకు గానూ ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి మండలంలో వార్డు స్థానాలు 112 ఉన్నాయి. గురువారం వార్డుల కోసం నామినేషన్లు ఎవరూ దాఖలు చేయలేదు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎస్సై గంగన్న ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎంపీడీవో రామచందర్, తహసీల్దార్ నాగరాజు నామినేషన్ కేంద్రాలను పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి



సప్తశక్తి సంగం కార్యక్రమం నిర్వహిస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు చైతన్యవంతులు కావాని న్యాయవాది రాపర్తి గాయత్రి అన్నారు. సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సప్తశక్తి సంగం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైష్ణవి, సువర్ణ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

చింతలమానేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీలు ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ బోర్డు నుంచి రెండు సంవత్సరాలు డీఎంఎల్‌టీ, డీఈసీజీ కోర్సు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. కళాశాలలో 30 సీట్లు ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు వచ్చే నెల 1 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఎస్ఈగా బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ(ఆపరేషన్)గా ఉత్తమ్ జాడే గురువారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లాలో పని చేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. గతంలో ఇక్కడ ఎస్ఈగా పని చేసిన శేషారావు ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఉత్తమ్ జాడే కలెక్టర్ వెంకటేష్ దోత్రేను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్టు



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

దహెగాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలో ఆన్‌లైన బెట్టింగ్ నిర్వహిస్తున్న ఐదుగురికి గురువారం దాడి చేసి పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. దహెగాం మండలం ఐనం గ్రామ శివారులో కొంత మంది యువకులు టోకెన్ పద్ధతిలో కొత్తరకం ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచా రం మేరకు దాడి చేశామని అన్నారు. అక్కడ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రాం వంటి సోషల్ మీడియా వేదికల్లో లైవ్ వీడియోలు పోస్టు చేస్తూ తమ టోకెన్లకు పెద్దమొత్తంలో ప్రైజ్ మనీ వస్తుందని ప్రజలను నమ్మించారని అన్నారు. పెద్ద మొత్తంలో లాబాలు వస్తాయనే ఆశ చూపించి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రతీ టోకెన్‌కు సుమారు వెయ్యి రూపాయల చొప్పున అమ్ముతున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో పెరుగు వినోద్, గోమసా హరీదాస్, జుమ్మిడి వసంత్, కొండగుర్ల నాగేందర్, వెంకటేష్ అనే వ్యక్తులు ఉన్నారని వివ రించారు. నిందుల నుంచి రూ.65,270 నగదుతో పాటు ఐదు మొబైల్ పోన్‌లు, స్టీల్ బాక్సు, టోకెన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడిలో ఎస్సై రాజు, పోలీసు సిబ్బంది మహమ్మద్, విజయ్, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తిర్యాణి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలంలో రాంబాయిగూడ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న అంగన్‌వాడీ భవనం పనుల్లో నాణ్యత లోపం వల్ల రాళ్లు బయపడ్డాయని, కాంట్రాక్టర్, ఏఈపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నీతి ఆయోగ్ కార్యకరమాన్ని అధికారులు అప్రతిష్టపాలు చేస్తున్నారని అన్నారు. ఏడు లక్షల అంచనా వ్యయంతో అంగన్‌వాడీ భవనం పనులు చేపడితే కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేస్తున్నాడని అన్నారు. ఏఈ నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందన్నారు. అధికారులు పట్టించుకోక పోవడం వల్లే పనుల్లో నాణ్యత లోపించిందని తెలిపారు. దీనికి బాధ్యుడైన కాంట్రాక్టరను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, తిరుపతి, బారిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.


వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

రెబ్బెన, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. జీఎం కార్యాలయంలో గురువారం ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిం చారు. తొమ్మిదో తరగతి చదువుతున్న శివకుమార్ ప్రయోగ ప్రదర్శనలో ప్రథమ స్థానం నిలిచి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, డీజీఎం మదీనా భాషా, కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

గంజాయి సాగు కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జైనూరు పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి మొక్కలు సాగు చేసిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ ఎస్సై సందీప్‌కు అందించిన విశ్వసనీయ సమాచారం మేరకు 2023లో అక్టోబరు 17న భూసిమెట్ట గ్రామంలో ఎస్ మనోహర్, జ్ఞానేశ్వర్ అనే వ్యక్తులకు సంబంధించిన పత్తి పంటలో తనిఖీ న్విహించగా మొత్తం 370 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. నిందితులపై ఏఎస్సై రాథోడ్ ఉమేష్ కేసు నమోదు చేశారు. అనంరతం జైనూర్ సీఐలు జి మల్లేష్, కే అంజయ విచారణ కొనసాగించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్‌రావు తమ వాదనలు వినిపించారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్ సాక్షాధారలు సమర్పించగా నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి మనోహర్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా, జ్ఞానేశ్వర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ఎస్సై రవికుమార్, ప్రస్తుత సీఐ రమేశ్, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, కోర్టు లైజనింగ్ అధికారులను ఎస్పీ అభినందించారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం కైరిగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బానోత్ సుబ్బారావు నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు సుమారు 30 మంది గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి కండువాలు వేసి ఆహ్వానించారు. బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, నాయకులు బాబురావు, రవీందర్, వెంకటేష్, సీతారాం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం విషాదాంతం

వ్యవసాయ బావిలో మహన్విత మృతదేహం లభ్యం

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ




మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో శనిగారపు మహన్విత (ఫైల్))

దండేపల్లి నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దండేపల్లిలో మూడు రోజుల క్రితం అదృశ్యమైన బాలిక వ్యవసాయ బావిలో శవమై తేలింది. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం సృష్టించింది. బాలిక మృతదేహం లభ్యమైందన్న విషయం గ్రామంలో దావానంలా వ్యాపించడంతో ఊరు ఊరంతా కదిలివచ్చింది. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ప్రారంభిం చారు. పూర్తి వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన శనిగా రపు శేఖర్, రజిత దంపతుల కూతురు మహన్విత (7) సోమవారం రాత్రి తోటి పిల్లలతో కలిసి ఇంటి ముందు ఆడుకుంటోంది. అప్పటికే రాత్రి కావడంతో మిగితా పిల్లలంతా ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. మహన్విత మాత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలిం చారు. చివరకు బాలిక తండ్రి శేఖర్ మరుసటి రోజు మంగళవారం దండేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చే శాడు. దీంతో మూడు ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకి తెలియలేదు. కాగా నంబాల గ్రామంలో ఓ రైతుకు చెందిన వ్యవ సాయ బావిలో గురువారం మృతదేహాన్ని చూసిన కొందరు పోలీసులు సమాచారం అందించారు. దీంతో సం ఘటనా స్థలానికి చేరుకున్న లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి, దండేపల్లి, లక్షెట్టిపేట ఎస్సైలు తహసీనోద్దీన్, సురేష్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదే హాన్ని పరిశీలించారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ సం ఘటనా స్థలానికి చేరుకుని వ్యవసాయ బావిలో మృత దేహాన్ని పరిశీలించి బయటకు తీయించి శవ పంచనామా చేశారు. బాలికను హత్య చేసి బావిలో పడేసిన ట్లు కుటుంబసభ్యులు, పోలీసులు అనుమానిస్తున్నారు. వెంటనే పోలీసు డాగ్ స్క్వాడ్‌తో వ్యవసాయ బావి నుంచి బాలిక ఇంటి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. వారితో పాటు వ్యవసాయ బావి వద్ద ఫింగర్ ప్రిం ట్ బృందం వచ్చి అక్కడి ఆనవాళ్లను సేకరించారు.

పాపను బలి తీసుకున్నదెవరు..?

నంబాల చెందిన శనిగారపు శేఖర్ మేకల కాపరి కాగా, తల్లి రజిత వ్యవసాయ కూలిగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కొడుకు విహన్(9), కూతురు మహన్విత ఉన్నారు. ఆ పాపను బలి తీసుకున్న దెవరు..అసలు బాలికను హత్య చేయాల్సిన అవసరం ఎవరికి వచ్చిందనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు..

బాలిక హత్య కేసులో గ్రామానికి చెందిన పలువురు అనమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.? దీనిపై పోలీసు అధికారులు పూర్తిస్థాయి విచారించి నిందితులను త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు, బంధువులు, ప్రజలు కోరుతున్నారు.

ఆత్మరక్షణకు కరాటే

● జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలల్లో అమలు ● ఆసక్తి చూపుతున్న చిన్నారులు



రెబ్బెనలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రెబ్బెన, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎదురయ్యే ఘటనలను ఎదుర్కొనేందుకు విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కరాటే శిక్షణకు శ్రీకారం చుట్టింది. బాలికలు, మహిళల రక్షణ కోసం కరాటే ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యార్థి దశలోనే బాలికలకు ఆత్మవిశ్వాసం పెరిగేలా ప్రభుత్వం పాఠశాలల్లో ఆత్మ రక్షణ విద్య(కరాటే) నేర్పించాలని ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేసి నిధులు కేటాయించింది. బాలికలకు కరాటే, కుంగ్‌ఫూ, జూడో వంటి విద్య నేర్పించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. కేవలం శిక్షణకే కాకుండా ఉత్తీర్ణత పరీక్ష కూడా రాయించి వారికి ధ్రువపత్రాలు కూడా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శిక్షణ కోసం నిపుణులను నియామక ప్రక్రియ పూర్తి చేసింది. జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలల్లో కరాటే శిక్షణ నేర్పిస్తున్నారు. ప్రతి పాఠశాలలో వారానికి ఆరు సార్లు శిక్షణ ఇస్తున్నారు. ఆరు నుంచి పదో తరగతి బాలికలకు 50 మంది లోపు ఉంటే శిక్షకులకు రూ.15వేలు, 50 మంది కంటే ఎక్కువగా ఉంటే రూ.30వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో బాలికలు 50 మంది లోపు ఉన్న పాఠశాలలు 5, 50 మంది కంటే ఎక్కువగా ఉన్నవి 65 ఉన్నట్లు విద్యా శాఖ అధికారులు వివరాలు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని 70 పాఠశాలను ఎంపిక చేశారు. ఇందుకు రూ.20.25లక్షల నిధులు విడుదల చేశారు. శిక్షకులను జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంటు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఈ తరగతులను పీఈటీ లేదా పీడీ పర్యవేక్షణలో 45 నిమిషాలు పాటు శిక్షణ నిర్వహిస్తున్నారు.

కరాటే శిక్షణ ఉపయోగకరంగా ఉంది..
పి.హిమబిందు, ఆరో తరగతి, జడ్పీహెచ్ఎస్, రెబ్బెన



కరాటే శిక్షణ ఉపయోగకరంగా ఉంది..శిక్షణకు నిత్యం హాజరవుతున్నాను. శిక్షకుడు నేర్పించిన సూచనలు, సలహాలు తప్పకుండా పాటిస్తున్నాం. శిక్షణకు ముందు కంటే మాలో ఆత్మ విశ్వాసం వచ్చింది. ఆపద ఎదురైనప్పుడు ఎలా ఎదుర్కొవాలో శిక్షకులు నేర్పుతున్నారు. చదువుతో పాటు కరాటే నేర్చుకోవడంపై దృష్టి సారించాం.

రెస్ట్‌హాళ్లకు మరమ్మతులు చేపట్టాలి

శ్రీరాంపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంప్ ఆపరేటర్, లైన్‌మెన్, ఎస్‌డీఎల్ ఆపరేటర్, కోల్‌కట్టర్లకు సంబంధించిన రెస్ట్‌హాళ్లకు మరమ్మతులు చేయించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్‌కే 5 గనిని గురువారం సందర్శించారు. కార్మికులతో మాట్లాడగా పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. రెస్ట్‌హాళ్లకు పైకప్పులు మార్చాలని, తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. నాణ్యమైన గ్లౌజులు, చలికోట్లు ఇవ్వాలని, కోల్‌కట్టర్లకు ఇన్సెంటివ్ వచ్చేటట్లుగా చేయాలని, యాక్టింగ్ కార్మికులకు ఎస్‌డీఎల్ ఆపరేటర్ పదోన్నతులు కల్పించాలని కోరారు. ఆయా సమస్యలను గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, నాయకులు మేడగోని మల్లేశం, కొట్టె శ్రీకాంత్, భోగ మధునయ్య, గోదారి మురళి, కుక్క శ్రీనివాస్, మహేందర్, నాగుల రాజయ్య, సంపత్, మురళి, మహేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న డీసీపీవో మహేష్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీపీవో మహేష్ అన్నారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, సూర్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం అమూల్యమని అన్నారు. బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని చెప్పారు. చదువు మధ్యలో ఆగిపోవడం, జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వం బాలికల అభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. 2030 నాటికి బాల్య వివాహాలు లేని దేశంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. పిల్లలు అంకిత భావం , క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత విద్యా వంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు సైతం బాలికలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంసీ శారద, ప్రధానోపాధ్యాయులు మహేష్, ఉపాధ్యాయులు శ్రీవర్ధన్, సూర్ సంస్థ కో ఆర్డినేటర్ సంతోష్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర బాలప్రవీణ్, దేవాజీ, జెండర్ స్పెషలిస్టు రాణి, సాగర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీసీపీవో మహేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చైల్డ్ రైట్స్, పోక్సో చట్టం, జువైనల్ జస్టిస్ యాక్ట్, బాల్య వివాహాల నిషేధ చట్టం తదితర బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గిఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సైతం అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో శిలాజాల సేకరణ



అటవీ ప్రాంతంలో శిలాజాలను సేకరిస్తున్న అధికారులు

కోటపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పారం అటవీ ప్రాంతంలో గురువారం పురావస్తు శాఖ అధికారులు వృక్ష, జంతు శిలాజాలకు సంబంధించిన ఫాజిల్స్‌ను సేకరించారు. రాష్ట్ర పురవస్తు, మ్యూజియం శాఖ సంచాలకులు ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి ఆదేశాలతో హైద్రాబాద్ నుంచి సాంకేతిక బృందం బొప్పారం అటవీ ప్రాంతానికి చేరుకుని ఫాజిల్స్ కోసం పరిశీలన చేశారు. ఈ అటవీ ప్రాంతంలో వృక్ష, జంతు శిలాజాలకు సంబంధించిన ఫాజిల్స్‌ను గుర్తించారు. ఈఫాజిల్స్ 230 మిలియన్ సంవత్సరాలకు సంబం.ధించినవని ఈ ఫాజిల్స్‌ను తెలంగాణ రాష్ట్ర మ్యూజియంలో సంద ర్శకుల నిమిత్తం ప్రదర్శించనున్నట్లు పురావస్తు శాఖ ఉప సంచాలకులు డాక్టర్ నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్లు మల్లునాయక్, సాగర్ తెలిపారు. ఈ పరిశోధనలో కరీంనగర్, రామగుండం సింగరేణి కాలరీస్ సిబ్బంది డీజీఎం హన్మంతు, జియాలజిస్టు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఎనిమిది నెలల జైలు శిక్ష

మంచిర్యాల క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డులోని ఓ హోటల్‌లో చోరీకి పాల్పడిన తొడిసం రాకేష్‌కు ఎనిమిది నెలల సాధారణ జైలు శిక్షతో పాటు వంద రూపాయల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి కె నిరోష తీర్పునిచ్చినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నస్పూర్ సీసీ కార్నల్ గాంధీ నగర్‌కు చెందిన గౌలీకర్ యాద్‌లాల్‌కు చెందిన హోటల్‌లో ఏప్రిల్ 25, 2025న చోరీ జరిగినట్లు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు పంపగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిత్రాలరాణి కోర్టులో సాక్షాలను ప్రవేశ పెట్టారు. నేరం రుజువు చేయడంతో శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ డీఏ చెల్లించాలి

పెంచికలపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీని ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సంఘం సభ్యులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కిశోర్, మల్లన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు రుణ లక్ష్యం సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకర్లు 2025-26 వార్షిక సంవత్సరం రుణ లక్ష్య సాధనలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట భవన సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన వార్షిక సంవత్సరం రెండో త్రైమాసిక సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డీఎం శ్రీనివాస్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రితీష్‌కుమార్ గుప్తా, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావులతో కలిసి హాజరై బ్యాంకుల వారీగా రుణాలు, బ్యాంకు లింకేజీ, వ్యవసాయ ఆధారిత రుణాలు, పంట రుణాలు, గృహ నిర్మాణ రుణాలు, విద్యా రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు నిర్దేశిత రుణ లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ముద్ర రుణాలు, ఆధార్ అనుసంధానం, బ్యాంకు లింకేజీలు, ఎస్‌సీ రుణాలు, ట్రైకార్ రుణ లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్, మెప్మా పీడీ మోతిరాం, సెర్ప్ డీపీఎంలు, ఏపీ ఎంలు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మీడియా సెంటర్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూంలో మీడియా సెంటర్‌ను గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు వి శ్రీనివాస్, వ్యయ పరిశీలకులు స్వప్న, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతలుగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. తొలి విడతలో ఐదు మండలాలు 27 కేంద్రాలలో నామినేషన్ స్వీకరించనున్నామని చెప్పారు. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు 2,874 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని అన్నారు. మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీల ద్వారా ప్రతికలలో, టీవీలలో వచ్చే చెల్లింపు వార్తలు, వార్త కథనాలు, ప్రకటనలపై, సోషల్ మీడియా ప్రచారంపై నిఘా ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థలలో సమాచారం కోసం కంట్రోల్ రూం హెల్ప్ లైన నంబర్ 8500844365ని సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జస్టిన్ జోల్, డీపీఆర్‌వో సంపత్‌కుమార్, డీపీవో భిక్షపతి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఇటీవల నల్గొండ జిల్లా చౌటుప్పల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో బంగారు పతకం, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం, బెంగుళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ఎంపికైన నలుగురు విద్యార్థినులు, కోచ్‌లను, వ్యాయమ ఉపాధ్యాయులు గురువారం కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి శేషు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఉద్దవ్, కోచ్‌లు తిరుమల, విద్యాసాగర్, అరవింద్, పీడీలు మీనారెడ్డి, లక్ష్మణ్, ప్రవీణ్‌కుమా ర్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో ఉద్యోగులు రక్షణతో కూడిన విధులు నిర్వహించేందుకు అవగాహన కల్పించాలని జీఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. జీఎం కార్యాలయంలని అన్ని విభాగాల అధిపతులతో గురువారం వార్షిక రక్షణ పక్షోత్సవాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనులలో ఉద్యోగుల రక్షణకు సింగరేణి పటిష్ట చర్యలు చేపడుతుందని చెప్పారు. ప్రతి ఉద్యోగికి సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. ఉద్యోగులు ఇంటి నుంచే రక్షణాత్మకంగా పరికరాలు ధరించి విధులకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. డిసెంబరు 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 56వ వార్షిక రక్షణ పక్షత్సవాల నిర్వహణ కోసం ఏర్పాట్లను ముమ్మరం చేయాలన్నారు. కళాకారుల పాటలు, నాటిక ద్వారా రక్షణ ప్రాముఖ్యతను వివరించాలన్నారు. బెల్లంపల్లి ఏరియాకు మొదటి బహుమతి వచ్చేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీవో నరేందర్, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, డీజీఎం మదీనాబాసా, సీహెచ్‌పీ ఇన్‌చార్జి కోటయ్య, వర్క్‌షాప్ హెచ్ఓడీ జ్ఞానేశ్వర్, ఖైరిగూడ మేనేజర్ శంకర్, ఎంవీటీసీ మేనేజర్ మధుసుదన్, పర్సనల్ హెచ్ఓడీ శ్రీనివాస్, సేఫ్టీ అధికారి గౌతం, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు ఆందోళనలు

మందమర్రిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సింగరేణిలో ఆందోళనలు కొనసాగు తున్నాయి. సింగరేణిలో పనిచేస్తున్న అన్ని కార్మిక సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడ్డాయి. మూడు రోజులుగా సింగరేణిలో ఆందోళనలు చేస్తున్నాయి. మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపడుతున్నారు. గనులు, డిపార్టు మెంట్ల ఎదుట, జీఎం కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. గురువారం టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు ఓ. రాజశేఖర్, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్‌లు మాట్లాడుతూ ఈ కోడ్‌లతో పారిశ్రామిక ప్రగతి దెబ్బతింటుందన్నారు. రానున్న రోజుల్లో ఈ కోడ్‌ల వల్ల ఉద్యోగుల కనీస హక్కులు కరువవుతాయన్నారు. వెంటనే కేంద్రం నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రిజర్వేషన్లు తారుమారు

» పంచాయతీ ఎన్నికల్లో పెరిగిన జనరల్ కేటగిరి సీట్లు » బీసీలు 20 స్థానాలకే పరిమితం

బెజ్జూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు తారుమారు కావడంతో ఆశావహులు నిరాశ చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీతో బీసీ వర్గాల్లో ఎన్నో ఆశలు నింపాయి. కానీ చివరకు పాత పద్ధతి రిజర్వేషన్ల ప్రకారమే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్తుండడంతో బీసీ వర్గాల్లో నిరాశ నెలకొన్నది. ఈసా రి ఆయా స్థానాల్లో తమకే రిజర్వు అవుతుందని ఆశించినా తాజా రిజర్వేషన్లతో నిరాశే మిగిలింది. జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియ ముగిసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వేడి మొదలైంది. రిజర్వేషన్ల ప్రక్రియతో రాజకీయ సమీకరణలో మార్పులు చోటుచేసుకున్నాయి. గత రిజర్వేషన్లతో పోలిస్తే ఈ సారి జననరల్ కేటగిరి పెరగడం, బీసీ స్థానాలు తగ్గడం, ఎస్టీ కేటగిరి పెరగడం లెక్కలను తలకిందులు చేసింది. పంచాయతీరాజ్ చట్టం నిబంధనల మేరకు మహిళలు, ఎస్సీ ఎస్టీ, జనరల్ రిజర్వేషన్లు అధికారులు కేటాయించారు.

నిబంధనల మేరకు..

జిల్లా వ్యాప్తంగా 335గ్రామపంచాయతీల వారిగా కేటాయించిన రిజర్వేషన్లలో ప్రతీ సామాజిక వర్గానికి జీవో నిబంధనల మేరకు కేటాయించారు. జిల్లాలో ప్రస్తుతం సామాజిక వర్గాల వారీగా కేటాయింపులు జరిగిన రిజర్వేషన్ల ప్రకారం సర్పంచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి. జనరల్ 85, ఎస్టీ 198, ఎస్సీ32, బీసీ20, వార్డు సభ్యుల్లో ఎస్టీలు 1,292, ఎస్సీలు 226, బీసీలకు 231, జనరల్‌కు 1.125సీట్లను కేటాయించారు. గత ఎన్నికల్లో అన్ని కేటగిరీల్లో మహిళలకు 166 సర్పంచ్ స్థానాలు కేటాయించారు. కానీ ఈ సారి 150కే పరిమితం చేశారు. వీరికి 42శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదని తాజా సీట్ల కేటాయింపులను బట్టి అర్థమవుతోంది. జనరల్ స్థానాల్లోనూ వీరు పోటీకి అవకాశం ఉండడంతో వాటిలో పోటీ చేసి గెలిస్తే వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఇక బీసీలను చూసినట్లయితే గత ఎన్నికల్లో వారికి 33 స్థానాలు ఇస్తే, ఈ సారి 20మాత్రమే కేటాయించారు. బీసీ సామాజిక వర్గం 42శాతం రిజర్వేషన్ల కోసం ఆందోళన చేస్తుండగా, ఈ సారి వారి స్థానాలు తగ్గడంతో ఏం చేస్తారో చూడాలి మరి. ఎస్సీలను చూసినట్లయితే గత ఎన్నికల్లో 27స్థానాలు కేటా యించగా, ఈ సారి 32కి చేరింది. జిల్లా వ్యాప్తంగా 2,874వార్డు సభ్యుల స్థానాలకు 1,276మహిళలకు రిజర్వేషన్ ఖరారు చేశారు. ఎస్టీలకు 1.292, ఎస్సీలకు 226, బీసీలకు 231, జనరల్‌కు 1125సీట్లు కేటాయించారు. బీసీలకు సీట్లు తగ్గాయని ఇటీవల జిల్లాలో ఆందళనలు చేపడుతున్నారు.

ఆశలు గల్లంతు..

గెజిట్‌లో పొరపాట్లు ఎలా ఉన్నా బీసీల ఆశలు మాత్రం గల్లంతయ్యాయని ఆవేదనం చెందుతున్నారు. జిల్లాలో పాత పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేసి 2019ఎన్నికల రిజర్వేషన్లతో పోల్చుకుంటే బీసీల రిజర్వేషన్లు తగ్గిపోయాయి. ఇక సిర్పూర్ నియోజకవర్గంలోని బెజ్జూరులో 22పంచాయతీల్లో ఒక్క బీసీకి కూడా స్థానం కల్పించలేదు. చింతలమానేపల్లిలో 19 సర్పంచ్ స్థానాలకు ఒక్క స్థానం మాత్రమే బీసీలకు కేటాయించారు. పెంచికలపేటలో 12స్థానాలుండగా కేవలం ఒక్క స్థానమే బీసీలకు రిజర్వు చేశారు. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో బీసీలకు అధిక స్థానాలు కేటాయింపు జరగగా వారిలో ఆశలు చిగురించగా, తాజా రిజర్వేషన్ల మూలంగా వారి ఆశలు గల్లంతయ్యాయి.

ఎల్టా మండల స్థాయి పోటీలు

తాండూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎల్టా మండల స్థాయి పోటీల్లో భాగంగా గురువారం తాండూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస, రాత పూర్వక పరీక్షలు నిర్వహించారు. ఇందులో మొదటి స్థానంలో తేజస్విని, రెండవ స్థానంలో రేచిని పాఠశాల విద్యార్థి అర్షర్థులు నిలిచారు. అలాగే జూనియర్ విభాగంలో ఉపన్యాస, రాత పరీక్షలో అమూల్య మొదటి స్థానంలో నిలిచింది. వీరు వచ్చే నెలలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ సర్టిఫికెట్లు అందించారు. ఉపాధ్యాయులు అశోక్, వెంకటేశ్వర్లు, రవిబాబు, సంతోష్, మురళీ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల సమావేశాలు

కాసిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో సర్పంచు అభ్యర్థులను నిలబెట్టేందుకు గురువారం కాసిపేటలో బీఆర్‌ఎస్, దేవాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ సమర్థవంతమైన అభ్యర్థులను నిలబెడితే వారిని గెలిపించేందుకు కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కాసిపేట సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, నాయకులు మోటూరి వేణు పాల్గొనగా దేవాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో నాయకులు భారతాని సతీష్, మేరుగు పద్మశంకర్, ఏనుగు తిరుపతిరెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

డ్రాయింగ్‌బుక్స్ అందజేత

జైపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుందారం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు గురువారం చిప్పకుర్తి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్పకుర్తి శ్రీనివాస్ ఉచితంగా డ్రాయింగ్‌బుక్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిత్రకళపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఈ బుక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు డ్రాయింగ్‌బుక్స్‌ను చూడగానే చాలా సంతోషపడ్డారన్నారు.

ఎన్నికల వేళ

మొండి బకాయిలు వసూలు

- ఇంటి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తున్న ఆశావహులు
- బ్యాంకుల్లో పాత అప్పులు క్లియర్
- నామినేషన్‌కు నోడ్యూస్ సర్టిఫికెట్ తప్పని సరి
- కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ పరుగులు



కర్ణమామిడిలో ఇంటి పన్ను చెల్లిస్తున్న ఆశావాహులు

నెన్నెల/హాజీపూర్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే వారికి నామినేషన్ పత్రాలతో పాటు ధృవ పత్రాల సమర్పణ తలనొప్పిగా మారింది. అన్ని తీర్ల సర్టిఫికెట్లు సమకూర్చుకునేందుకు నేతలు హైరానా పడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో సమర్పనకు అతి తక్కువ సమయం ఉంది. వివిధ పత్రాల కోసం కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. కొత్తగా రిజర్వేషన్లు తారుమారు కావడం, ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే పోటీకి అనర్హులనే నిబంధన ఎత్తివేయడంతో కొత్త వారు చాలా మంది తెరపైకి వచ్చారు. వారంతా



నామినేషన్లు వేయాలంటే కులం, నివాసం, స్టడీ సర్టిఫికెట్లు తప్ప నిసరిగా సమర్పిం చాల్సి ఉంటుంది. సమయం లేక పోవడంతో ఇప్పటికిప్పుడు తహసీల్దార్ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందడం కష్ట మవుతోంది. మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ నాయకులు పరుగులు పెడుతున్నారు. లోకల్ బ్యాంకులో కొత్త ఖాతాతో పాటు అప్పులు లేనట్లు నోడ్యూస్ సర్టిఫికెట్ కూడా అవసరం కావడంతో బ్యాంకులకు క్యూకడుతున్నారు. క్రిమినల్ కేసులు, కోర్టు కేసులు లేవని రూ. 50 బాండ్ పేపర్‌పై అఫి డవిట్ సమర్పించాలి. వయసు నిర్ధారణ కోసం ఎస్సె స్సీ మెమో జత చేసుకోవచ్చు. పదో తరగతి కంటే తక్కువ చదువుకున్న వారైతే బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రం దాఖలు చేసేటప్పుడు ఈసీ విధించిన నిబం ధనలు పాటించాలి. సూచించిన పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలి. ఏఒక్కటి మిస్ అయినా నామినేషన్ తిరస్కరణకు గురువుతుంది. కాబట్టి అభ్యర్థులు అన్ని పత్రాలు సేకరించడంతో పాటు బకాయిలు లేకుండా చూసుకుంటున్నారు.

మొత్తం కట్టాల్సిందే...

నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు వారిని బలపరిచే వారు ఎలాంటి అప్పులు, బకాయిలు ఉండరాదు. వారి పేరిట గ్రామ పంచాయతీ నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. దీంతో గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను బకాయిలు మొత్తం చెల్లించే స్తున్నారు. వారిని బలపరిచే వారి పన్నులు అభ్యర్థులే కట్టేస్తున్నారు. ఇన్నాళ్ల ఎలాం టి అవసరం పడక పోవడంతో పన్నుల చెల్లింపులకు మొండికేసిన వారున్నారు. అలాంటి వారు దేవుడాంటూ మొత్తం కట్టేస్తున్నారు. అభ్యర్థి పేరిట ఉన్న ఇంటి కరెంటు బిల్లు కూడా పూర్తిగా చెల్లించి బాకీ లేనట్టు పత్రం జత చేయాలి. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచు, వార్డు సభ్యులుగా పోటీ చేసే వారు ఇలా పదుల సంఖ్యలో ఉండగా వారిని బల పరిచే వారు సైతం బిల్లులు క్లియర్ చేస్తున్నారు. బ్యాంకుల్లోని పాత అప్పులు చెల్లించడం, వడ్డీ కట్టీ రిన్యూ చేసుకొని అప్పులేనట్టు ధృవపత్రం తీసుకుంటున్నారు. ఎన్నికల పుణ్యామా అని ఇంటి పన్ను బకాయిలు, కరెంటు పెండింగ్ బిల్లులు, క్లియర్ అవుతున్నాయి.

నిండుతున్న ఖజానా

పంచాయతీ ఎన్నికల పుణ్యమాని ఏళ్ల తరబడి పెండింగ్ బిల్లులు వసూలవుతున్నాయి. ఎన్నికలో సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేసే వారు తమ సొంత ఇంటి పన్ను బకాయితో పాటు బలపరిచే అభ్యర్థుల ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నారు. దీని కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నామినేషన్ కేంద్రం వద్ద బిల్లు బుక్‌తో బిల్లు కలెక్టర్‌కు ఓ టేబుల్ వేశారు. ఆన్లైన్ పేమెంట్లు కూడా తీసుకుంటున్నారు. నామినేషన్ మొదటి రోజు హాజీపూర్ మండల వ్యాప్తంగా రూ.4 లక్షల వరకు పన్నులు వసూలు అయినట్టు తెలుస్తోంది. నేడు, రేపు కూడా నామినేషన్‌లు స్వీకరణ ఉండడంతో జీపీలకు భారీగా ఆదాయం సమకూరనుంది. కొన్ని నెలలుగా పంచాయతీలకు నిధులు రాక సిబ్బంది జీతాలు చెల్లించ లేని పరిస్థితి ఉన్న సమయంలో ఈ పన్నుల వసూలు కాస్త ఊరట కలిగించనుంది.

షీటీంపై విద్యార్థులకు అవగాహన

లక్సెట్టిపేట, నవంబరు, 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌడే పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రామగుండం షీటీం పోలీసులు గురువారం షీటీంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా షీటీం పోలీసులు మాట్లాడుతూ బాల్ వివాహ్‌ముక్త్ కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేకు పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. బాల్యవివాహాలు చట్ట విరుద్ధమైనదని ఇది ఒక హానికరమైన చర్య అని వయస్సు రానిదే పెళ్లి చేసుకోకూడదని ఎవరైనా అలా చేయాలని చూస్తే వెంటనే షీటీం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి విద్య ఆరోగ్యం సామాజిక సేవలపై దృష్టి సారించి ముందుకు సాగాలన్నారు. ఈకార్యక్రమంలో షీటీం పోలీసులు సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి విద్యార్థులు పాల్గొన్నారు.

జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

బెల్లంపల్లి,నవంబరు27(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులు పోటీలో ఉండి బీసీలు అందరూ గెలిపించుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీసీ సమాజ్ అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర్‌లు అన్నారు. గురువారం పట్టణంలోని ఎఎంసీ క్రీడామైదానంలో బీసీ రిజర్వేషన్లు, హక్కులపై చర్చా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బీసీల హక్కులు బలోపేతం కోసం కలిసికట్టుగా బీసీలందరూ ముందుకు వెళ్లాలన్నారు. షెడ్యూల్ 9లో బీసీ హక్కుల చేర్పు అవసరం ఉందని ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాల్లో న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. సమాజ అభివృద్ధి కోసం బీసీలు ఐక్యంగా ముందుకురావాలని పేర్కొన్నారు. బీసీల హక్కులు చట్టబద్ధత కోసం ఉద్యమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ జిల్లా అధ్యక్షురాలు సువర్ణ, శంకర్, గజెల్లి మోహన్, శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, పాల్గొన్నారు.

తొలిరోజు 39 నామినేషన్లు..

(5వ పేజీ తరువాయి)

మాకులపేటలో 1, నాగస ముద్రంలో 1, మ్యాదరిపేటలో 1, మామిడి పల్లిలో 1, వెల్గనూర్‌లో 1, కాసిపేటలో 1, నంబాలలో 1, చింతపల్లిలో 1సర్పంచుల కోసం నామినేషన్ వేసినట్లు మండల ప్రత్యేక అధికారి దుర్గప్రసాద్, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్ తెలిపారు.

అందని పత్రాలు.. నామినేషన్ ఆలస్యం..

హాజీపూర్ : మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ స్వీకరణ మొదటి రోజైన గురువారం నామినేషన్ ప్రక్రియ మందకొడిగా సాగింది. మండలంలోని 12 గ్రామ పంచాయతీలు, 106 వార్డులకు గాను కేవలం సర్పంచ్‌కు నాలుగు, వార్డు సభ్యులకు 2 నామినేషన్‌లు మాత్రమే దాఖలయ్యాయి.

ధ్రువపత్రాల గందరగోళం..

సర్పంచ్, వార్డు సభ్యుల కోసం పోటీ చేసే అభ్యర్థులు గురువారమే మంచి ముహూర్తం ఉందని, నామినేషన్‌కు అన్ని సిద్ధం చేసుకునే క్రమంలో ధ్రువ పత్రాల గందరగోళంతో నామినేషన్ వేయలేక పోయారు. కుల, ఇతర ధ్రువీకరణ పత్రాలు సమయానికి అందక నిరుత్సాహపడ్డారు. నోటిఫికేషన్ వచ్చిన రెండు రోజుల్లోనే నామినేషన్ ఉండడంతో పోటీ చేసే ఆశావాహులు పార్టీల మద్దతు కూడగట్టుకునే పనిలో ఉండి సంప్రదాయంగా ధ్రువ పత్రాలు సమ కూర్చుకోవడంలో సమయం లేక మొదటి రోజు నామినేషన్ తక్కువగా పడ్డాయి. సర్పంచ్ కోసం హాజీపూర్ జీపీ నుంచి ఇద్దరు, దొనబండ నుంచి ఒక్కరు. పెద్దంపేట నుంచి ఒకరు నామినేషన్ వేశారు. ఇక వార్డు సభ్యులకు హాజీపూర్, దొనబండ నుంచి ఒక్కొక్కరు వేశారు.

'స్థానికం'లో పట్టు కోసం..

(5వ పేజీ తరువాయి)

వారి గెలుపు కోసం కృషి చేయాలని యోచిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కావడంతో వారిని ప్రసన్నం చేసుకొనే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఇందిరమ్మ చీరల పంపిణీతోపాటు స్వయం సహాయక సంఘాల సభ్యుల మద్దతును కూడ గట్టేందుకు వడ్డీలేని రుణాలను విడుదల చేసింది. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు, గృహజ్యోతి వంటి సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం ద్వారా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేపట్టింది.

బీఆర్‌ఎస్‌కు సవాల్...

పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కూడా తన వంతు ప్రయత్నాలను ముమ్మరం చేసింది. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవి చూసిన ఆ పార్టీ, పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పునుజ్జీవనం పొందే ఆలోచనలో ఉంది. ఈ మేరకు గత పదేళ్ల పాలనలో పంచాయతీల అభివృద్ధికి చేసిన కృషి, గ్రామాల్లో కల్పించిన మౌలిక వసతులను గుర్తు చేయడం ద్వారా పల్లె ఓటర్లను ప్రసన్నం చేసుకొనే దిశగా వ్యూహాలను రచిస్తోంది. చెన్నూరు, బెల్లంపల్లి నియోజక వర్గాల పరిధిలోని పల్లెల్లో బీఆర్‌ఎస్‌కు ఇప్పటికీ గట్టి పునాదులే ఉన్నాయి. క్యాడర్‌తోపాటు క్రియాశీల నాయకులు ఉన్నారు. వారందరిలో ఉత్సాహం నింపడం ద్వారా పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నడుం బిగిస్తున్నారు.

మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజక వర్గంలో ఆ పార్టీ మూడో స్థానానికి పడిపోవడం ప్రస్తుత పంచా యతీ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర వైఫలం కారణంగా పార్టీ క్యాడర్ పెద్ద ఎత్తున ఫిరాంపులకు పాల్పడింది. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందడం ఆ పార్టీకి సవాల్‌గా మారింది.

గెలుపు కోసం బీజేపీ ఆరాటం...

ఇదిలా ఉండగా బీజేపీ కూడా పంచాయతీ ఎన్నికల్లో ఖాతాలను తెరవాలనే యోచనతో ఉంది. వీలైనంత వరకు తమ పార్టీ నాయకులు సర్పంచులుగా గెలిచేలా వ్యూహరచనలు చేస్తోంది. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజక వర్గంలో బీజేపీ ద్వితీయ స్థానంలో నిలబడటం ఆ పార్టీ క్యాడర్‌లో కొంతమేర ధైర్యం నింపింది. అయితే గత పంచాయతీ ఎన్నిక ల్లో బీజేపీ మద్దతు దారుల్లో ఎక్కువ మంది సర్పంచులుగా గెలవలేక పోయారు. దీంతో ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ స్థానాలను గెలుచుకోవడం ద్వారా గ్రామ స్థాయిలో ఆ పార్టీ పునాదులను పటిష్టం చేసు కొనే పనిలో నిమగ్నమైంది.

వరి కొయ్యలను కాల్చవద్దు

హాజీపూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : వరి కొయ్యలను కాల్చవద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సురేఖ అన్నారు. గురువారం గుడిపేట్ రైతు వేదికలో భూసార మినీ కిట్లను పంపిణీ చేశారు. జిల్లాలో ప్రతి మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులకు అందచేయడం, శిక్షణ ఇచ్చామన్నారు. భూసార పరీక్షలు వాటి ప్రాముఖ్యతను సమీక్షించారు. ఏడీఏ మామిడి క్రిష్ణ, ఏవోలు క్రిష్ణ, పర్వీన్, రజిత, ఏఈఓ ప్రసన్నలు పాల్గొన్నారు

ఆంగ్లభాష వ్యక్తిగత ఎదుగుదలకు దోహద పడుతుంది



విజేతలకు బహుమతులు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కాసిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్లభాష వ్యక్తి గత ఎదుగుదలకు దోహదం చేస్తుందని ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాబ్జీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఎల్టా ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఒలంపియాడ్ ఎడ్యుకెస్ట్ పోటీలను నిర్వహించారు. జూనియర్ కేటగిరిలో సాత్విక, వర్షిత, సీనియర్ కేటగిరిలో అవంతిక, శ్రీవాత్సవ, ఎడ్యుకెస్ట్ పోటీల్లో జూనియర్ కేటగిరిలో వైష్ణవి, సుజిత్‌కుమార్, సీనియర్ కేటగిరిలో సయ్యద్‌పాషా, సంజన గెలుపొందగా వీరికి బహుమతులు అందించారు. ఇన్‌చార్జి ఎచ్‌ఎం రమణారెడ్డి, ఎల్టా మండల కన్వీనర్ పుష్పలత, ఆంగ్ల ఉపాధ్యాయులు అరుణకుమారి, వెంకటేశ్వర స్వామి, అనిత, నిర్మల, సరిత పాల్గొన్నారు.

ఖోఖోలో రాష్ట్రస్థాయిలో బహుమతి

మందమర్రిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నారం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న దుర్గ ప్రసాద్ ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడు. గురువారం పాఠశాలలో విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు దత్తుమూర్తి, ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు రాఫెల్ రెడ్డి విద్యార్థిని అభినందించి బహుమతి అందించారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి



జైపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

జైపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో కలిసి మెలిసి పనిచేయాలని చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ కార్య కర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎక్కువ సంఖ్యలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చల్ల విశ్వంబర్ రెడ్డి, జక్కుల వెంకటేశం, శ్రీనివాస్, ముదాం రమేష్, గడ్డం సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

భీమారం : మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచు అభ్యర్థులు ఎవరైనా నాయకులు, కార్యకర్తలు వారి గెలుపు కోసం కృషి చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అభ్యర్థికి సీటు కేటాయించిన తర్వాత ఎవరైనా రెబెల్‌గా దించడం కానీ, వేరే పార్టీకి కోవర్టు రాజకీయాలు చేస్తే భవిష్యత్‌లో వారికి పార్టీ నుంచి ఎలాంటి సహకారాలు ఉండవని హెచ్చరించారు. అనంతరం నాయకులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, మండల పార్టీ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, రవి, పున్నం చంద్, అమర్‌సింగ్, లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచు ఎన్నికలకు కలిసి వస్తున్న ప్రేమ పెళ్లిళ్లు



ధర్మారావుపేట గ్రామపంచాయతీ

కాసిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏజెన్సీ గ్రామపంచాయతీల్లో ప్రేమ పెళ్లిళ్ల సర్పంచు అధికార పదవులకు కలిసి వస్తున్నాయి. మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉండగా ఇందులో 16 పంచాయతీలు ఏజెన్సీ గ్రామపంచాయతీలే కావడం విశేషం. మిగిలిన 6 గ్రామపంచాయతీల్లో రొటేషన్ పద్ధతి వల్ల తాటిగూడ పంచాయతీని ఈ సారి ఎస్టీకి కేటాయించారు. ఎస్టీ రిజర్వేషన్‌ల సంగతి ఎలా ఉన్నా మూడు పంచాయతీల్లోఎస్టీ ఓటర్ల కొరత ఏర్పడింది. మండలంలోని మేజర్ పంచాయతీ కాసిపేట, చిన్న ధర్మారం, ధర్మారా వుపేట పంచాయతీల్లో ఎస్టీ ఓటర్లు లేరు. ధర్మారావుపేటలో గత సర్పంచు ఎన్నికల్లో ఎస్టీ ఓటర్లు లేక సర్పంచు ఎన్నికలు నిలిచిపోయాయి. ప్రేమ పెళ్లితో కాసిపేటకు ధరావత్ దేవి, చిన్న ధర్మారానికి భుక్య సునీతలు సర్పంచులుగా ఎన్నికయ్యారు. ఈ సారి రెండవ విడతలో జరగనున్నపంచాయతీ ఎన్నికలకు దర్మారావుపేటలో ప్రేమ పెళ్లితో ముగ్గురు అమ్మాయిలకు ఓటు హక్కు లభించింది. అలాగే చిన్న ధర్మారంలో మరో ముగ్గురికి ఓటరు లిస్టులో చోటు లభించింది. కాసిపేట మేజర్ పంచాయతీలో 8 మంది మహిళలు ఎస్టీ ఓటర్లు ఉన్నారు. 2019 లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ధర్మారావుపేటలో ఎస్టీ ఓటర్లు లేకపోలింగ్ నిలిచిపోయింది. కానీ ఈ ఏడాది ప్రేమపెళ్లితో ముగ్గురు అమ్మాయిలు అత్తారింటికి రావడంతో ముగ్గురు మహిళ గిరిజన ఓటర్లు ఉన్నారు. ఈ సారైనా ధర్మారావుపేటలో ఎన్నికలు జరిగేనా అని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా కాసిపేట మేజర్ పంచాయతీలో 3094 మంది ఓటర్లు ఉండగా 12 వార్డులు ఉన్నాయి. ఇందులో ఆరు వార్డులను ఎస్టీలకు కేటాయించారు. ధర్మారావుపే టలో 1526 మంది ఓటర్లు ఉండగా 10 వార్డులు ఉన్నాయి. ఇందులో ఐదు వార్డులను ఎస్టీలకు రిజ ర్వు చేశారు. అలాగే చిన్న ధర్మారం పంచాయతీలో 634 మంది ఓటర్లు ఉండగా 8 వార్డులను ఏర్పాటు చేశారు. ఇందులో నాలుగు ఎస్టీ రిజర్వు చేశారు. సర్పంచు స్థానాలకే అభ్యర్థులు లేక సతమతమవుతున్న వివిధ పార్టీలకు, వార్డు మెంబర్లను నిలబెట్టడానికి తలమునకలవుతున్నారు. ఈ మూడు పంచాయతీల్లో వార్డు మెంబర్ల అభ్యర్థుల కొరత తీవ్రంగా ఉంది. కొన్ని పంచాయతీల్లో వార్డు మెంబర్లకు అభ్యర్థులు లేక వివిధ పార్టీలు ఇబ్బందులు పడుతున్నాయి. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మూడు పంచాయతీల్లో ఎస్టీ వార్డు మెంబర్లే లేకపోవడం విశేషం.

సాధారణ ప్రసవాలను చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులు సాధారణ ప్రసవాలను చేయాలని, సిజేరియన్‌లకు దూరంగా ఉండాలని డీఎంహెచ్‌వో అనిత పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కాన్పుకు వచ్చే గర్భవతులకు సాధారణ ప్రసవం చేయాలని, ప్రసవ వివరాలను, గర్భవతుల వివరాలను రోజువారీగా నమోదు చేయాలని ఆదే శించారు. ఆసుపత్రుల్లో ధరల పట్టికలను, లింగనిర్ధారణ చేయబడదని ఆసుపత్రుల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ అరుణశ్రీ, ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్, డీపీవో ప్రశాంతి, ప్రవళిక, భాగ్య 29 మంది గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు వాయిదా

మంచిర్యాల క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల ఆటల పోటీలు వాయిదా వేస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎలక్షన్ కోడ్ అమలు లో ఉన్నందున ఈ నెల 29న బాయ్స్ హై స్కూల్‌లో నిర్వహిం చే దివ్యాంగుల ఆటల పోటీలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల కోడ్ ప్రభావంతో అంతర్జాతీయ దివ్యాంగుల ఆటల పోటీలు వాయిదా పడినట్లు తెలిపారు. వివరాలకు మహిళా శిశు దివ్యాంగులు, వయో వృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ వ్యక్తుల శాఖ జిల్లా కార్యాలయంను సంప్రదించాలని తెలిపారు.

రైతుల ఖాతాల్లో వరిధాన్యం నగదు జమ

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2025-26 సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో జనమ చేశామని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇటిక్యాలలో మెప్మా ఆధ్వర్యంలో, గుల్లకోటలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని తెలిపారు.

పీడీఎస్‌యూ జిల్లా మహాసభ

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ జిల్లా 20వ మహాసభలను మంచిర్యాలలోని మార్క్స్‌భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యామాల దిక్సూచిగా పీడీఎస్‌యూ నిలుస్తుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాల్‌కుమార్, శ్రీకాంత్, నాగరాజు, బ్రహ్మానందం పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్ల పరిశీలన

తాండూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లోని స్టేజ్ 1 ఆర్వో నామినేషన్ కేం ద్రాన్ని గురువారం బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్‌కుమార్ పరిశీలించారు. నామినేషన్‌ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలన్నారు. అనంతరం అచ్చలాపూర్ క్లస్టర్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్‌కుమార్, కార్యదర్శులు ఉన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

దండేపల్లి నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచు, వార్డు సభ్యుల నామినేషన్‌ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని మంచి ర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం మండలంలోని లింగాపూర్, మ్యాదరిపేట, దండేపల్లి నామినేషన్ కేంద్రాలను సందర్శించి నామినేషన్ ప్రక్రియ తీరును పరిశీలిచారు. ఆయన ఎన్నికల సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగ్గిన ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి దుర్గప్రసాద్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపిడివో జేఆర్ ప్రసాద్, ఎంపివో విజయ ప్రసాద్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

చింతగూడ ఆలయ హుండీ లె క్కింపు

జన్నారం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవి ఆలయంలో గురువారం దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. ఆలయ పర్యవేక్షకులు రవి కిషన్ హుండీ లెక్కింపులో 7లక్షల 90వేల 750 రూపాయల నగదు రాగా మిశ్రమ బంగారం 27గ్రాములు, మిశ్రమ వెండి 620 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ముక్త రవి,తో పాటు పోలీసు సిబ్బంది అర్చక సేవా సమితి సభ్యులు ఉన్నారు.

బీజేపీలోకి చేరికలు..

హాజీపూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ర్యాలీ, ముద్ఫార్ గ్రామాలకు చెందిన పలువురు మండల అధ్యక్షుడు గడ్డం స్వామి రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ సమక్షంలో గురువారం భారతీయ జనతా పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఉప సర్పంచ్ సుంచు శ్రీనివాస్, నాయకులు లింగాల అశోక్ చేరారు.

తపస్ మండల కమిటీ ఎన్నిక

భీమారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) భీమారం మండల కమిటీని స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దుర్గం చందు, మెరుపుటాల సతీష్, కాంప్లెక్స్ కన్వీనర్, కో కన్వీనర్, మహిళ కన్వీనర్‌గా రవికుమార్, రవీంద్రచారి, జ్యోతిలను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు బండి రమేష్, యశ్వంతుల వెంకటేష్‌లు ప్రకటించారు. నూతన సభ్యులను జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయింపు శ్రీనివాసరావు, బగ్గని రవికుమార్‌లు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య,నాగేందర్, రమాదేవి, శ్రీనివాస్, సంతోష్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

చర్చీల అభివృద్ధికి చేయూతనిస్తా

మందమర్రిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : త్వరలో రానున్న క్రిస్మస్ పండగ నేపథ్యంలో చర్చీల అభివృద్ధికి చేయూతనిస్తానని రాష్ట్ర ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెం కటస్వామి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పాల చెట్టు ఏరియాలో గల బేతెస్త చర్చీలో ఫాదర్లు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ ప్రభుత్వం క్రిస్టియన్‌లకు అండగా ఉంటుం దన్నారు. మందమర్రిలో ఉన్నటువంటి చర్చీల గురించి ఫాదర్లు తమ దృష్టికి తీసుకువచ్చారని, చర్చీల్లోని సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. నూతన చర్చీల ఏర్పాటుకు నిధుల కేటాయింపుపై దృష్టి పెడతానని తెలిపారు. మంత్రిని చర్చిఫాదర్లు షఘనంగా శా లువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్చిల ఫాదర్లు, కాం గ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ పోటీలో ఉంటుంది

బెల్లంపల్లి, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పార్టీ పోటీలో ఉంటుందని టీఎన్‌టీయుసీ రాష్ట్రప్రధాన కా ర్యదర్శి మణిరాంసింగ్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాకప్పి పార్టీలో ఆహ్వానించి మాట్లాడారు. నియోజక వర్గరంలో టీడీపీని బలోపేతం చేసేందుకు నాయకులందరం ఐక్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు.



ఘనంగా వీపీ సింగ్ వర్ధంతి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు తొలిసారిగా రిజర్వేషన్‌ల హక్కులను అందించిన మహనీయుడు దివంగ ప్రధాని విశ్వనాథ ప్రతాప్ సింగ్ 17వ వర్ధంతిని గురువారం బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మల్లయ్య, రాజేశం, జ యరావు, కొండయ్య పాల్గొన్నారు.


కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదులు, సమాచారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం మొదటి విడతలో 90 సర్పంచు, 816 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఫిర్యాదుల కోసం 08736-250501లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్ష

లక్సెట్టిపేట, నవంబరు, 27(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎల్లా సంస్థ ఆధ్వర్యంలో ఆంగ్ల భాషపై మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం పోటీ పరీక్ష నిర్వహించారు. ఈపరీక్షలకు సుమారు 60మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసారు. ఈపోటీ పరీక్షల్లో లక్సెట్టిపేట పాఠశాలకు చెందిన జాహ్నవి, హసాద్య, రిషిక, బాలుర పాఠశాలకు చెందిన జశ్వంత్, కస్తూరిబా పాఠశాలకు చెందిన అశ్విత, అక్షయ అనే విద్యార్థులు ప్రతిభ చూపారు.

స్థానికంలో పట్టు కోసం..



- పంచాయతీ పోరుపై పల్లెల్లో జోరుగా మంతనాలు
- సర్పంచ్, వార్డు స్థానాలపై ప్రత్యేక దృష్టి
- పార్టీల గుర్తులు ఉండకపోవడంతో అభ్యర్థులపై గురి
- ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న అన్ని పార్టీలు

మంచిర్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీల పునాదులను పటి ష్ఠం చేసుకోవడమే లక్ష్యంగా ముఖ్య నాయకులు పావులు కదుపుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు పూర్తికావడం, గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కావడంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఇదే అదునుగా వివిధ పార్టీలు ముఖ్య నాయకుల మంతనాలు సైతం జోరందుకున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసుకున్నారు కూడా. ముఖ్యంగా సర్పంచ్ పీఠంపై కన్నేసిన వారంతా జిల్లా, రాష్ట్ర నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. పంచాయతీ ఎన్నికలు పార్టీల గుర్తులపై జరగకున్నా గ్రామ స్థాయిలో తమ పార్టీ పునాదులను పటిష్ఠం చేసు కోవడం కోసం రాజకీయ పార్టీలు అభ్యర్థులను బలపరుస్తున్నాయి.


గెలుపు అవకాశాలపై మంతనాలు...

పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల ఆనుకూలత, గెలుపు అవకాశాలపై లెక్కలు వేసుకుంటూ వివిధ పార్టీల నేతలు క్యాడర్‌తో మంతనాలు జరుపుతున్నారు. ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ల వివరాలు తెలుసుకొని ఆ మేరకు పోటీలో గెలుపొందే సత్తా ఉన్న అభ్యర్థులను ప్రోత్సహిస్తున్నారు. మండల స్థాయి నాయకుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటూ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలను రచిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వు అయిన గ్రామ పంచాయతీల్లో కొంచెం ఆర్థిక పరపతి ఉన్నవారు పోటీకి సన్నద్ధం అవుతున్నారు. సర్పంచ్ పదవులకు పోటీ ఎక్కువగా ఉన్న చోట అసంతృప్తికి చోటు లేకుండా పార్టీ నాయకులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఒకరినిక సర్పంచ్, మరొకరిని ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలోకి దింపాలనే యోచనలో ఉన్నారు. ప ల్లెల్లో పట్టు సాధించేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు వ్యూహాలకు పదును పెడుతున్నా యి. పార్టీ గుర్తులు లేకపోయినా తమ కార్యకర్తలను గెలిపించుకోవాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నాయి.

కాంగ్రెస్ వ్యూహాలు...

అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపు ధీమాతో కొద్ది నెలల నుంచే పావులు కదుపుతోంది. బీసీలకు 42 శాతం రి జర్వేషన్లు కల్పించడం ద్వారా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను గంప గుత్తగా తన ఖాతాలో వేసుకోవడా నికి ప్రయత్నించినప్పటికీ కోర్టు తీర్పులతో ఆ వ్యూహం బెడిసికొట్టింది. అయినా కూడా పార్టీ పరంగా జనరల్ స్థానాల్లో వీలయినంత ఎక్కువ మంది బీసీలకు మద్ద తు ఇవ్వడం ద్వారా..

(తరువాయి 7లో)



అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి

మంచిర్యాల డీసీపీ భాస్కర్



నామినేషన్ కేంద్రాన్ని సందర్శిస్తున్న డీసీపీ

హాజీపూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : యువత రాజకీయాల్లో రాణించాలని, ఆశయంతో ముందుకు వెళ్లాలని కానీ ఎన్నికల సమయంలో గొడవలకు పోతే కేసులు నమోదవుతాయని డీసీపీ భాస్కర్ అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా గురువారం హాజీపూర్ మండలంలో నిర్వహిస్తున్న సాధారణ ఎన్నికల సర్పంచ్, వార్డు సభ్యుల పోలింగ్ కేంద్రంలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియను డీసీపీ పరిశీలించారు. సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో, భద్రత, శాంతిభద్రతలను పర్యవేక్షించడానికి డీసీపీ నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రత చర్యలను చేపట్టాలని ఎస్ఐ స్వరూప్ రాజ్‌ను ఆదేశించారు. మొదటి విడతలో భాగంగా జిల్లాలోని 28 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి నామినేషన్ కేంద్రంలో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరిని మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఉన్నట్లు వివరించారు. డీసీపీ వెంట మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే, ఎంపీడీవో సాయివెంకట్ కృష్ణరెడ్డి ఉన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి

సన్నాహక సమావేశంలో బాల్క సుమన్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, పక్కన మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య

నస్పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ తన ప్రాణాలను లెక్క చేయకుండా చేపట్టిన దీక్ష రోజు (నవంబరు 29, 2009)ను దీక్షా దివస్‌గా నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జిల్లా అధ్యకుడు బాల్క సుమన్ కోరారు. నస్పూర్‌లోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల, నాయకుల, అనుబంధ సంఘాల నాయకులతో సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్న య్యలతో కలిసి గురువారం నిర్వహించారు. ఈ నెల 29న ఇక్కడ నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమంపై నాయకులకు, కార్యకర్తలకు బాల్క సుమన్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



నామినేషన్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

లక్సెట్టిపేట, నవంబరు, 27(ఆంధ్రజ్యోతి): రెండవ సాధారణ ఎన్నికల నేపధ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణల ప్రక్రియన్ ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం ఆయన లక్సెట్టిపేట మండలంలోని గుల్లకోట, పోతపల్లి, చందారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులను నామినేషన్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రం ముందు ఫోటోతో ఓటర్ల జాబితా అదే విధంగా గ్రామాల వార్డుల వారిగా రిజర్వేషన్ల జాబితా అంటించాలన్నారు. నామినేషన్ కేంద్రాలకు వంద మీటర్ల పరిదిలో ఎవరూ గుంపులుగా రాకుండా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారితో పాటు సహాయక రిటర్నింగ్ అధికారులక పలు సలహాలు సూచనలు అందజేసారు. అనంతరం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, లక్సెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న మార్చురి గది పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎమ్మార్వో దిలీప్ కుమార్, ఎంపిడీవో సరోజ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్ ఉన్నారు.

తొలిరోజు 39 నామినేషన్లు దాఖలు..

- సర్పంచ్ స్థానాలకు ..25
- వార్డు సభ్యులకు..14

మంచిర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి రోజైన గురువారం 39 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి విడుతలో భాగంగా మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాలతోపాటు నిర్మల్ జి ల్లా ఖానాపూర్ నియోజకవర్గం పరిధికి సంబంధించి జిల్లాలోని జన్నారం మండలంలో ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా మండలాల్లోని మొత్తం 90 గ్రామ పంచాయతీలు, 816 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించనుండగా నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. తొలి రోజు దాఖలైన వాటిలో సర్పంచ్ స్థానాలకు 25, వార్డు సభ్యుల స్థానాలకు 14 నామినేషన్లు దాఖలయ్యాయి.

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో

జన్నారం: మండలంలో నామినేషన్ల పర్వం మొదటి రోజునే 14 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని 29 గ్రామ పంచాయతీలు, 272 వార్డులకు గాను, 11 సర్పంచ్‌లకు నామినేషన్లు, 3 వార్డులకు నామినేషన్లు మొదటి రోజు దాఖలైనట్లు ఎంపీడీవో ఉమర్‌షరీఫ్ తెలిపారు. మండలంలోని చింతగూడ గ్రామంలో 2, రాంపూర్, కవ్వాల, బంగారుతండా, రేండ్లగూడ, పొన్కల్, మహ్మదాబాద్, దేవునిగూడ, చామనపల్లి, బాదంపల్లి గ్రామాల నుంచి ఒక్క నామినేషన్లు దాఖలుకాగా వార్డు సభ్యుల నామినేషన్లలో రేండ్లగూడలో 2, పొన్కల్‌లో 1 దాఖలయ్యాయి. పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అనంతరం ఇంధన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును పరిశీలించారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయితీలకు మొదటి రోజు గురువారం ఒక్కరు మాత్రమే సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసారు. మండలంలోని గుల్లకోట గ్రామంలో (జనరల్ మహిళ) దేవి దేవమణి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు ఎంపీడీవో సరోజ తెలిపారు. మొత్తం 18గ్రామాలకు కలిపి 160వార్డు సభ్యులకు నామినేషన్ వేయాల్సి ఉండగా వార్డు సభ్యులుగా నామినేషన్ దాఖలు కాకపోవడం విశేషం.

దండేపల్లి: దండేపల్లి మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయితీలకు మొదటి రోజు గురువారం 9మంది సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేసారు. వార్డు సభ్యుల కోసం 9మంది నామినేషన్ వేశారు. మండలంలోని తాళ్లపేటలో 1.. (తరువాయి 7లో)

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

నస్పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురై చికిత్స పొంది రెండు నెలల విరామం తర్వాత గురువారం నియోజకవర్గానికి వచ్చిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ సముదాయంలోని హెలిప్యాడ్‌కు ప్రత్యేక చాపర్ ద్వారా చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషంతో టపాసులు పేల్చి సంబరాలు చేసారు. ఇక్కడి నుంచి వాహనాల ర్యాలీతో మంచిర్యాల పట్టణంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు.

బాల్య వివాహాలపై అవగాహన

జన్నారం,నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తపాల్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎస్ఐ అనూష ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికలకు 18 ఏండ్లు, బాలురకు 20 ఏండ్లు నిండిన తరువాత వివాహాలు జరిపించాలని, అంతేగాకుండా విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరు స్థిరపడ్డాక వివాహాలు చేసుకోవాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు దుంపల తిరుపతి, ఉపాధ్యాయులు రాజేందర్, గోపాల్, రామరావు పాల్గొన్నారు.

అడవిలోకి వెళ్లవద్దు

ఉచ్చులు, విద్యుత్ వైర్లు అమర్చితే చర్యలు తప్పవు : ఎఫ్‌డీవో



పులి అడుగులను పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో రామ్మోహన్

జన్నారం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అట విడివిజన్‌లో గల ఇంధన్‌పల్లి రేంజ్‌లో ఆవుని పులిదాడి చేసి హత మార్చగా రెండో రోజు కళాబారాన్ని తినేందుకు పులి వచ్చిందని అటవి అధికారులు పూర్తి స్థాయిలో నిర్ధారణకు వచ్చారు. గురువారం ఎఫ్‌డీవో రామ్మోహన్ అటవి ప్రాంతాన్ని పరిశీలించి పులి అడుగులను గుర్తించారు. కవ్వాల్‌టైగర్ జోన్‌లోని ఇంధన్‌పల్లి అటవి రేంజ్ పరిధిలో పులి తిరుగుతుందని ఈ అటవి ప్రాంతంలోకి ఎవరు వెళ్లకూడదని పశువుల కాపరులు కూడ అడవిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. అటవి ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న పొలాల్లో, చేన్లలో ఉచ్చులు పెట్టిన, విద్యుత్‌వైర్లు అమర్చిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పులిని కాపాడుకు నేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ఆయన వెంట ఎఫ్ఆర్‌ఓ లక్ష్మీ నారాయణ, అటవిశాక సిబ్బంది ఉన్నారు.

లెక్కమించొద్దు ...

కోటపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయ గరిష్ఠ పరిమితిని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. పోటీ చేస్తున్న అభ్యర్థులు పరిమితికి లోబడి ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాగే ప్రతి రోజు ఖర్చుల వివరాలను నమోదు చేసుకుని పోలింగ్ ముగిసిన తర్వాత 41 రోజుల్లో మండల పరిషత్ కార్యాలయంలో అప్పగించాలి. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచు, వార్డు సభ్యులకు ఎన్నికల వ్యయ పరిమితిని ఎన్నికల సంఘం నిర్ధారించింది.

- 5 వేలకు మంచి జనాభా ఉంటే సర్పంచు అభ్యర్థి రూ. 2.50 లక్షలు , వార్డు సభ్యులు రూ. 50 వేలు మాత్రమే ఖర్చు చేయాలి.
- 5 వేల మంది కంటే తక్కువ జనాభా ఉంటే సర్పంచు అభ్యర్థి రూ. 1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ. 30 వేలు మాత్రమే ఖర్చు చేయాలి. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈ లెక్క మించొద్దు.

కొనసాగుతున్న వైజ్ఞానిక ప్రదర్శన..



ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థినులు

నస్పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీసీసీలో 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డ్ మనక్ జిల్లా స్థాయి ప్రదర్శన-ప్రాజెక్ట్ కాంపిటీషన్ ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజ గోపాల్‌ల పర్యవేక్షణలో వైజ్ఞానిక ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఈ ప్రదర్శనలో బాల వేధావులు తయారు చేసిన పలు నూతన ఆవిష్కరణలు అకట్టుకుంటున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఆధునిక సాంకేతిక ఎగ్జిబిట్లను తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. వీక్షించడానికి వచ్చిన విద్యార్థులకు వారు తయారు చేసిన ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను వివరిస్తున్నారు. ఆధునిక సాంకేతికత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, గణిత మోడలింగ్, గ్రీన్ ఎనర్జీ, సుస్థిర వ్యవసాయం, ఆరోగ్యం, పరిశుభ్రత, నీటి సంరక్షణలపై 253 ప్రాజెక్టులు, ఇన్‌స్పైర్-108 ప్రదర్శనలు మొత్తం 361 ప్రాజెక్టులు ఉన్నాయి. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ప్లాస్టిక్ వినియోగం, పర్యావరణంపై ప్రభావం అంశంపై సెమినార్ జరిగింది. 18 మంది ఉపాధ్యాయుల వివిధ అంశాలపై తయారు చేసిన టీఎల్ఎం బోధనకు ఉపయోగపడే తీరుతో టీఎల్ఎం మేళాను నిర్వహించారు.

చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు సందర్శించారు.

- **వాయు కాలుష్య నివారణ - దామిషా, మంచిర్యాల**

మానవాళిపై వాయు కాలుష్య ప్రభావం పెను సవాల్‌గా మారిపోయింది. దీనిని గుర్తించడానికి పరిశ్రమలు వదిలే విష వాయువులను గుర్తించి గాలి నాణ్యతను మెరుగు పర్చడంలో ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. పర్టిక్యూలర్ మేటర్ 2.5ఎం తక్కువ ఉన్న గాలి కణాలను దొరకబట్టి వాతావరణంలోకి వదలకుండా నివారించడంలో కీలకంగా వ్యవహరిస్తుంది.

పార్టీ అభివృద్ధికి పాటుపడాలి

మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్,నవంబరు27(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్దే ఏకైక లక్ష్యంగా కార్యకర్తల ఆలోచనలకు అనుగుణంగా నడుచుకోవాలని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పిన్నింటి రఘునాథ్ రెడ్డి మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రి ఆయన శాలువాతో సత్కరించి విలేకరులతో మాట్లాడుతూ మూడున్నర దశబ్దాలుగా పార్టీ కోసం పనిచేసినటువంటి రఘునాథ్ రెడ్డి పార్టీ అధిష్టానం ఆయన సేవలను గుర్తించి అధ్యక్ష పదవి కట్టబెట్టిందన్నారు. ఈ పంచాయతీ ఎన్నికల్లో ప్రణాళిక బద్దంగా పని చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఏ పార్టీ నుంచి పెద్దగా పోటి ఉండదని కాంగ్రెస్ పార్టీలోనే ఆశావహుల పోటీ ఎక్కువగా ఉందని దీనిని సమన్వయం చేసుకుంటూ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలన్నారు. అనంతరం మంత్రి మందమర్రి, సారంగపల్లి, చిర్రకుంట, ఆదిల్‌పేట, వెంకటాపూర్, తిమ్మాపూర్, పులిమడుగు, బొక్కలగుట్ట, అందుగులపేట, గ్రామాలకు సంబంధించి నాయకుల, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో ప్రభంజనం తప్పదు

- ప్రభుత్వంపై బురద జల్లుతున్న ప్రతిపక్షాలు
- మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోత్వరలోనే జరిగే పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ఈ ఎన్నికల్లో కూడ ప్రతిపక్ష పార్టీలకు కూడ మళ్లీ ఓటమి తప్పదని రాష్ట్ర కార్మిక ఉపాధిగనులశాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్‌వెంకటస్వామి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్లపాలనలో జరిగిన అవినీతి, కుంభకోణాలు ప్రజలందరూ గమనించే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గురువారం పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వి లేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పక్ష పార్టీలపైన నిప్పులు చల్లారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కనీస అవగాహన లేదని ఏది పడితే అది మాట్లాడడం అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ పాలనలో అమ్మిన భూములను మళ్లీ అమ్ముతాతరో కేటీఆర్, హరీశ్‌రావులు తెలిపాలని మండిపడ్డారు. పరిశ్రమల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామాల్లో మంచి అభ్యర్థులను ఎన్నుకోవడం ద్వారా గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను క్రమ క్రమంగా అమలు చేశామన్నారు. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలైందోలేదో పెద్దఎత్తున అభ్యర్థులు పోటీపడు తున్నారని ఎవరిని నిర్ణయించాలో తెలియని పరిస్థితులు నెల కొన్నాయంటే తమ ప్రభుత్వపనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు.

ఇప్పటికే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ పూర్తిగా విఫలమ య్యాడని ఆయన నేతృ త్వంలో వచ్చిన ఎన్నికల్లో ఓటమే ఎదురవు తుందని, పార్టీని పెంపొందించుకోవడం కోసం పాటు పడితే బాగుంటుంద న్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను మరింత విశ్వనగరంగా తీర్చిది ద్దడంలో భాగంగానే ప్రభుత్వం 28 మున్సిపాలిటీలను విలీనం చేసి మినీ మహానగరంగా మారుస్తామన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి

ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, స్థానిక నాయకులు సొత్కు సుదర్శన్, రమేశ్, ఎండీ ఇసాక్, ఆకారం రమేశ్, సట్ల సంతో ష్‌గౌడ్, మంద తిరుమల్, ఎర్ర రాజు, శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, జమాల్‌పూర్ నర్సోజీ పాల్గొన్నారు.